రాఘవులు

- దార్ల తిరుపతిరావు



“**రా**ఘవులు ఇండియా వస్తున్నాడు. అమ్మమ్మా” అరిచాను చేతిలోని ఉత్తరం టేబిల్ మీద పెడ్తూ. 80 ఏళ్లు పైబడిన ఆ ముసలావిడ ఆశ్చర్యంగా చూస్తుండగా లోపలికెళ్లాను.

★ ★ ★

ఎన్నిరోజులైందో, ఉహూ... ఎన్ని సంవత్సరాలైందో అతన్నిచూసి. దూరం అప్యాయతల్ని పెంచుతుంది గదా? నా ఆత్మలో ఆత్మ అతను. నలభై సంవత్సరాలపైమాటే. అందంగా అతను రాసే ఉత్తరాల్లో తప్ప అతనిగురించి, అతని కుటుంబం గురించీ ప్రత్యక్షంగా తెలీదు. అతను ఉత్తరం రాస్తే ‘పిక్చర్’ వేస్తాడు. ఇన్నాళ్టికి అతను భార్యా, ఇద్దరు పిల్లల్తో ఈ ఊరొస్తున్నాడు.

గతకాలము మేలు-వచ్చు కాలముకంటే అన్నట్టుంటాయి మా ఇద్దరి ముచ్చట్ల జ్ఞాపకాలు.

★ ★ ★

మా మల్లయ్యపేటలో అప్పటికింకా ఊరికి నాలుగు వైపులా నాలుగు చెరువులున్న రోజులు. ఒకటి మాత్రమే హైస్కూలు, నాలుగు ప్రయిమరీ స్కూళ్లున్న రోజులు. వర్షంకురిస్తే రోడ్లనించి మట్టి వాసన గుభాళించే రోజులు. పెరట్లో-మామిడి చెట్లూ, అరటి చెట్లూ ప్రక్క ప్రక్కనే -వర్ణవివక్ష లేకుండా పెరిగే రోజులు, జూన్ రెండో వారంలోనే తొలకరి - చిలకరించే రోజులు. ఉన్న ఒకే సినిమా హాల్లో ‘జానపదాలే’ వినిపించి, పలకరించే రోజులు. అది మమ్మీ, డాడీ సంస్కృతి యింకా మొదలవని రోజులు. రేషన్‌షాపులో పంచదార తప్ప ఇంకేమీ ఇవ్వని రోజులు.

ఆరోజు సన్నగా తుంపరపడుతుంటే హైస్కూల్లో జాయిన్‌కావడానికి నేనూ, నన్ను జాయిన్ చెయ్యడానికి మా పెద్దమ్మగారబ్బాయి హైస్కూల్లో ప్రవేశించాము. అప్పుడే రివటలాంటి ఓ ముసలాయన నాలాగే ఉన్న ఓ కుర్రాణ్ని వెంటబెట్టుకొని మా ప్రక్కనే నడుస్తూ.

“బాబూ! మావోణ్ని ఇస్కూల్లో జేర్పించాల కుంచెం సాయింజేత్తావా, నాకు ఇక్కడ సంగతులేవీ తెలీవు’’. అని మా అన్నయ్యతో అంటూ ఒదిగిపోతున్నట్టు ప్రక్కకి జరిగాడు.

మా అన్నయ్య ఎందుకో అదోలాచూసి ‘రా’ అన్నాడు. ఎందుకో మా అన్నయ్య చూపులో,

పిలుపులో తేలికభావం కనిపించింది. నాకూ, రాఘవులు అనే ఆ అబ్బాయికి జాయిన్ కావడానికి-వయసు సరిపోక-ఒక సంవత్సరం పుట్టుక తేదీ-పెంచి హైస్కూల్లో జాయిన్‌చేసాడు. ఎప్పుడు, ఎందుకు అలాచేసాడో మా అన్నయ్య ఆరోజునుండి ఇప్పటి వరకూ మా స్నేహం స్నేహానికే గర్వకారణమైంది.

రాఘవులు వాళ్ల నాన్న - ఉంటే పొలం పన్లు చేసేవాడు లేదంటే పట్నంలో పప్పుల బజార్లో మూటలు మోసేవాడు. ఎప్పుడూ వంట్లో ఆరోగ్యం బావుండేది కాదు. దగ్గుతూ ఉండేవాడు. వాళ్లు ఊరిశివార్లలో ఉండే గుడిశెల్లో ఉండేవారు.

రాఘవులు ప్రతిసంవత్సరం స్కూల్ ఫస్టే ఒక ప్రక్క ఆటలు బాగా ఆడేవాడు, ఇంట్లో పనులన్నీ అతనే చేసేవాడు. నీళ్లకావిడి మోసేదగ్గర్నుంచి బజారు నుంచి కూరలు తేవడం వరకూ అతనే వాళ్లింట్లో మాది మధ్య తరగతికి దిగువ - బడుగు వర్గానికి ఎగువ. నాకు ఆ అవసరాలు లేవు. స్కూలు నించి వచ్చిన వెంటనే వాళ్ల గుడిశెలవైపు వెళ్లి పోయేవాణ్ని రాఘవుల్తో తిరగడంవల్ల మా వీధిలో ఉండే నా ఈడు కుర్రాళ్లు నాతో సరిగ్గా ఉండేవాళ్లుకాదు. రాఘవులు మాత్రం వాళ్లతో కూడా కలిసిపోయేవాడు. గూడెంనించి హైస్కూల్లో చదివేవారు తక్కువ; అందులోనూ అతను బాగా చదివే వాడవడం వల్ల - అందరూ గౌరవంగా చూసేవారు.

అతన్తో చేపల మార్కెట్‌కి వెళ్లి - అతని చేపల సంచి మోసే వాణ్ని. అందరూ వింతగా చూసేవారు నా కేసి. బజారు నించి ఏమైనా సరుకులు తేవలసివస్తే ఇద్దరం మోసుకొచ్చేవాళ్లం. శెలవు రోజొస్తే చాలు - ఇద్దరూ కల్సి దుంపతోటలో దుంపలు తవ్వి 'తంపట' పెట్టి కాల్చుకొనితినే వాళ్లం. వేరుశెనగ చేలోపడి. పాలతో ఉన్న పనలు కోసి వేరు శెనగ కాయలు తినేవాళ్లం. కొక్కెం గాలం కొని వర్షం నీళ్లున్న గుంటల్లో 'మట్టగిడసలు' పట్టేవాళ్లం. వాళ్లమ్మ కాల్చి పెడితేనే తినేవాళ్లం. పుల్లమామిడి కాయలు, జాంకాయలు దొంగతనంగా కోసి - ఉప్పు, కారం, అద్దుకొని తినేవాళ్లం,

గుబురుగా పెరిగిన దొడ్లో, ఎండు కసివింత పుల్లలకి రంధ్రం చేసి రాఘవులు తెచ్చిన అగ్గిపుల్ల నేల మీదగీసి వెలిగించి సిగరెట్‌లా కాల్చేవాళ్లం. మిణుగురు పురుగుల్ని రాత్రిళ్లు పట్టుకొని పుస్తకంలో దాచి ప్రొద్దున్న మా మిగిలిన ఫ్రెండ్స్‌కి చూపించ డానికి తీసుకెళ్లేవాళ్లం-పుస్తకం తెరిచి చూస్తే చచ్చిపోయివుండేవి. ఆరుద్ర పురుగులు పట్టుకొని 'ముఖ్‌మల్' లా వుండేదాన్ని తాకి ఆనంద పడిపోయేవాళ్లం.

ఇన్ని చేసినా అతని 'ప్రోగ్రెస్ రిపోర్టు'లో ఒక ఎర్రగీత కూడా ఉండేదికాదు. నాకు మాత్రం - ఒకటో, రెండో ఉండేవి. ఈ సారైనా 'మంత్లీ టెస్టు'లో రాఘవులులా ఎర్రగీతలేకుండా చూసుకోవాలనుకొనే వాణ్ని . నా గీత మారేది కాదు.

అతనికి ప్రతీ సంవత్సరం సోషల్ వెల్ఫేర్ స్కాలర్‌షిప్ మెరిట్ స్కాలర్‌షిప్పు వచ్చేవి. మెరిట్ స్కాలర్‌షిప్, ఎక్కువ డబ్బుల నీ - అదే తీసుకొనేవాడు.

అతను మా ఇంటికి రావడం మొదట్లో అమ్మమ్మకి ఇష్టముండేదికాదు. చుట్టుప్రక్కల జనం ఏమన్నా అనుకొంటా రేమోనని అమ్మమ్మ భయం. మా అమ్మమ్మకి ముక్కుపొడుం, నల్లమందు వాడ్డం అలవాటుండేది. వాటితో గాని దానికి నిద్రపట్టేదికాదు. అప్పట్లో నల్లమందు దొంగ తనంగా అమ్మేవారు. అది మాన్పించడం ఇంట్లో వాళ్లతరం గాలేదు. రాఘవులు చాలా తెలివైనవాడు నల్లమందు

గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్

సర్ హ్యూగ్ బీవర్ (ఇంగ్లండ్) అనే వ్యక్తికి పక్షులను వేటాడే అలవాటుండేది. 'గిన్నీస్ బ్రూవరీ' అనే బీరును తయారు చేసే సంస్థకు డైరెక్టర్‌గా ఉండేవాడు. యూరప్‌లో కెల్లా వేగంగా ఎగిరే పక్షి ఏది? అనే సందేహాన్ని తీర్చుకోవడానికి తగిన పుస్తకమేదీ ఆయనకు కనిపించలేదు. బీవర్ కోరిక మేరకు నారిస్ మెక్‌విర్టర్, రాస్‌మెక్ విర్టర్‌లు ఇలాంటివింతలు విశేషాలను సేకరించి గ్రంథాన్ని రూపొందించారు. ఆ గ్రంథమే 'గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' అనే పేరు ప్రచురింపబడింది. ఈ ప్రచురణ 27-8-1955న జరిగింది.

గిడుగు రామమూర్తి పంతులు

శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలో ఆగష్టు 29, 1863న జన్మించినారు. మహారాజా కళాశాలలో గురజాడ వారు వీరికి సహాధ్యాయి. సవరజాతి వారి కోసం పాఠశాలలు పెట్టించాలని ప్రయత్నించారు. సవర భాషకు ఒక లిపిని ఏర్పాటు చేసి సవర భాషా రచనలు సేకరించారు. సవర భాషా నిఘంటువు, సవర భాషా వ్యాకరణ నిర్మాణంలో వీరి కృషి ఎన్నదగినది. వాడుక భాషా ఉద్యమాన్ని నడిపి 'గిడుగు పిడుగు' అని పించుకున్నారు. పాఠ్య పుస్తకాలలో వాడుక భాషను ప్రవేశ పెట్టడంలోను, సాహిత్య రంగంలో వ్యావహారికభాష విస్తృతంగా వ్యాప్తి చెందడంలోను వీరు విశేష కృషి చేశారు.

వేసుకోవడం తను మాన్పిస్తానన్నాడు. పందెం కాశాను అతను మాన్పించ గలిగితే అతన్ని అద్దె సైకిల్ మీద కాకినాడ తీసుకెళ్లి కొత్త సినిమా చూపించాలి.

ఆరోజు బియ్యంలో ఓ మాదిరి నల్లరాళ్లు ఏరి వాటికి కొబ్బరి నూనె రాసి నల్ల మందులా ఆకులో చుట్టి ఇచ్చాడు మా అమ్మమ్మకి రోజూ ఒక మట్టి రాయి నల్ల మందనుకొని మింగేది. మామూలుగానే పదిరోజుల్లైంతర్వాత మళ్లీ 'నల్లమందు' కావాలంది. అప్పుడు అమ్మమ్మకి అసలు సంగతి చెప్పాడు. నల్లమందువల్ల నిద్రపట్టడం జరగదు. అని చెప్పాడు. నల్లమందువల్ల ఉపయోగంలేదని తెలిసింతర్వాత అమ్మమ్మ మానేసింది. ఆ తర్వాత అమ్మమ్మక్కూడా అతను మంచివాడైపోయాడు.

ఆరోజు - నాకు ఇప్పటికీ బాగా జ్ఞాపకం- ఆ తర్వాత నన్ను ఎప్పుడూ వదిలిపెట్టలేదు అతను. ఆ సంఘటన వేసవి శెలవుల్లో జరిగింది. తొమ్మిదో తరగతి పరీక్షలు రాశాము.

రాఘవులు వాళ్ల నాన్నకి ఆరోగ్యం పూర్తిగా పాడైంది. దాంతో వాళ్లమ్మ పాచిపనులు చేయడానికి ఎక్కడెక్కడో తిరిగి ఇంత తెచ్చేది అప్పుడప్పుడు మా ఇంట్లోనే తినే వాడు రాఘవులు. "బాబూ, సత్యవతమ్మ గారింట్లో వేరుశెనక్కాయలు కొట్టడానికి వెళ్లకూడదూ.. శేరుకి పావలాయో అర్థో ఇస్తారు" అంది మా అమ్మమ్మ రాఘవుల్తో.

"వెళ్తానమ్మమ్మా, పుస్తకాలు కొనుక్కోడానికైనా పనికొస్తాయి" అన్నాడు. చదువంటే అభిమానం అతనికి నేనూ వెళ్తానన్నాను ఎందుకంటే రాఘవుల్ని ఇంకా కాకినాడ సినిమాకి తీసుకెళ్లలేదు చాలా రోజులైపోయింది అతను పందెం గెలిచి మరి.

ఊళ్లోని మోతుబరి రైతుభార్య సత్యవతమ్మ ఇంటి దగ్గర పాత వేరుశెనక్కాయలు కొట్టించి, వేరు శెనగ గుళ్లు ఎండపెట్టి విత్తనాలుగా వాడేవారు. వేరు శెనగగుళ్లు శేరు వలిచి నందుకు పావలా ఇచ్చేది. పొల్లుకాయల్లో వచ్చే చచ్చూ పుచ్చూ వలిచిన వాళ్లకి ఇచ్చేది. అదీ దయాధర్మభిక్ష. రోజుకి ఇంచుమించు పది, పన్నెండు శేర్లు వలిచేవారు కొంత మంది పిల్లాజెల్లాతో వచ్చేవారు. అదే ఆదరువు అయ్యేది కొంతమంది చచ్చువి ఇళ్లకి తీసుకుపోయేవారు. అంతమాత్రానికే వాళ్లు ఆమెని 'మారాజుతల్లి' అనేవారు అభిమానంగా అందులో ఎక్కువ మంది మరి రాఘవులున్నగుడిశెల వాళ్లే.

ఆరోజు నేనూ, రాఘవులు అమ్మమ్మతో వెళ్లాం అక్కడికి. రాఘవులు ఏ పన్లోకి వెళ్లినా వెంటనే చొచ్చుకు పోతాడు. వేరుశెనక్కాయలు కొట్టడం మొదలెట్టాడు. ప్రక్కనే కూర్చొన్న నేను మాత్రం మామూలే.

మందువాలోగిలి వల్ల ఎండచుర్రుమంటుంది. అయినా స్పీడుగానే కొడుతున్నాడు రాఘవులు. నాకు ఆకలేస్తోంది. అతనికీ ఆకలేస్తుందేమో కొట్టిన గుళ్లల్లోంచి గుప్పెడు నోట్లో వేసుకొన్నాము. అవి ఆగుతాయా? ఎవరూ చూడ్డంలేదనుకొని రెండో సారి మళ్లీ గుప్పెటితో నోట్లో వేసుకొన్నాను నేను. అతను కూడా నన్ను చూసి గుప్పెటనిండా తీసినోట్లో వేసుకున్నాడు. అప్పుడు పడింది మూతి మీద పిడిగుద్దు. పళ్లు రాలాయో లేదో గానీ రక్తం కలిసిన వేరుశెనగ గుళ్లు అతని నోట్లోంచిరాలి పడ్డాయి.

" అలగా నాకొడకా వేరుశెనక్కాయలు వొలవరా అంటే తిని పెడతావురా నాకొడకా! నీకు డబ్బిలిచ్చే దెందుకురా. ఎల్లేటప్పుడు ఎలాగూ పెడుతున్నా గదరా. అప్పడూ పట్టుకెళ్లి ఇప్పుడూ తినేస్తే మేమేంచెయ్యాల్రా ఎదవా? ఫో! మళ్లీరావద్దుపో!"

అంటూ మెడపట్టుకొని విసురుగా గెంటేసింది సత్యవతమ్మ. మేము చూళ్లేదుగానీ మా వెనక్కాలే పనిమనిషి చేత పేలు తీయించుకొంటుంది సత్యవతమ్మ .

రాఘవులు దీనంగా చూసి కారుతున్న రక్తాన్ని చొక్కాకి తుడుచుకొంటూ నిలబడి నాకేసి చూసాడు. నాకు వంట్లో రక్తం మరిగిపోయింది. నేనూ నుంచున్నాను.

"ఏం భద్రయ్యమ్మ మనవడా నువ్వుకూర్చో ఇలాంటి ఎదవల్తో నీకేంటి. ఈడితో చెట్టపట్టా లేంట్రా నీకు. నువ్వెళ్లేటప్పుడు నీకు వేరుశెనగగుళ్లు ఇస్తాను. పట్టుకెళ్లి మీ అమ్మమ్మకియ్యి పప్పుండలు చేసిపెడద్ది. కూర్చో!" అంది.

ఇంకా ఏదేదో మాట్లాడుతుంది గానీ నాకు ఆమె మాటలు వినపడ్డంలేదు! చెట్టాపట్లాలేంట్రా అంటుందా? కులాన్ని చూసుకొని చెట్టాపట్టా లేనుకోవాలా? "అదీ రాఘవుల్తో స్నేహం చెయ్యొద్దంటుందా" అన్పించగానే పిడికిలి బిగిసింది.

రాఘవులు చెయ్యి పట్టుకున్నాను గట్టిగా. అటూ ఇటూ చూసాను. "రా" అని రాఘవుల్ని లాగి, అప్పటివరకూ మేమిద్దరం వలచిన 'వేరుశెనగ గింజల్ని' కాల్తో తన్ని చెల్లా చెదురు చేసి పరిగెత్తాం. అక్కడున్నవాళ్లందరూ తెల్లబోయి చూస్తున్నారు మావంక. పెద్దపాలేరు పరిగెత్తుకు రావడం కూడా కన్పించింది. మేము స్కూల్ రన్నింగ్ రేస్‌లో ఫస్టు, సెకండ్ మరి - వాళ్లకి దొరకలేదు. ఆ తర్వాత మా ఇద్దరి స్నేహానికీ ఏ కులం అడ్డుగోడగా నిలవలేక పోయింది. కాలం కూడా పరీక్షపెట్టి ఓడిపోయింది.

★ ★ ★

రాఘవులు కుటుంబంతో ఓ నెల రోజులపాటు మాకు హాయిగా గడిచిపోయింది.

అప్పట్లో రాఘవులూ, నేనూ అమ్మమ్మ - సత్యవతమ్మ యిచ్చిన పుచ్చు వేరుశెనగ పప్పుతో బెల్లం కలిపి చేసిన ఉండలు ఇష్టంగా తినేవాళ్లం. కానీ సత్యవతమ్మ మా వాణ్ణి కొట్టిన తర్వాత వేరు శెనగ ఉండలంటే నాకు అసహ్యం వేసింది.

ఆ రోజు వేరుశెనగ వుండలు మా ఆవిడ టేబిల్ మీద పెట్టింది రాఘవులు భార్యా, పిల్లలు తిండం మొదలు పెట్టారు. రాఘవులు మాత్రం నాకేసి చూడ్డం మొదలెట్టాడు నవ్వుతూ.

"నాకు మంచి ఫ్రెండ్ నిచ్చిన 'వేరుశెనగ' గుళ్లు అంటే చాలా యిష్టం" అంటూ ఒకటి చేతిలోకి తీసుకున్నాడు. "నాఫ్రెండ్ రక్తం కళ్లచూసిన 'వేరుశెనగ' పప్పు అంటే నాకసహ్యం" - అంటూ ప్లేట్‌ని వెనక్కితోసాను నేను. నవ్వుతూ ఆరోజు పేపర్ చేతిలోకి తీసుకున్నాడతను.

"అంటరానికులం పిల్లల సహపంక్తిన అగ్రకులాల వారి పిల్లలకి భోజనం"- కారణంగా అగ్రకులాలవారి పిల్లలు బడికి వెళ్లని కారణంగా ఓ చోట 'మధ్యాహ్నభోజన' పథకం విఫలం.

"అంటరాని వారు తయారు చేసిన వంటలు మిగిలిన పిల్లలు తినని కారణంగా మిగిలిపోయిన అన్నం. మిగిలిన పదార్థాలు - కాకులు, కుక్కలు తింటూ" కలర్‌ఫోటో

ఆ వార్త మా ఇద్దరి చూపుల్ని తప్పించుకోలేక పోయింది. ఫోటో తళుక్కున మెరిసింది.

మా ఇద్దరి చూపులు ఒకేసారి కలుసుకున్నాయి. 'మనిద్దరిలాగే ఆ పిల్లల తల్లిదండ్రులుంటే ఇలాజరిగి ఉండేదా? అన్నట్టుందా చూపు. 'ఛీ!' అంటూ పేపర్ విసిరేసాన్నేను వాడి చేతుల్లోంచి "మొదట్నించీ ఇంతే నమ్మాయితను" అంటూ మా ఆవిడకేసి తిరిగి నవ్వుతున్నాడు అతను. ★

ఉస్మానియా విశ్వవిద్యాలయం

నిజాం సంస్థానంలో ఆనాడు ఉర్దూ చదవడం, వ్రాయడం తెలిసిన వారు తక్కువగా ఉండడం వల్ల స్థానికులకు ఉర్దూ విద్యనందించాలన్న ఉద్దేశ్యంతో ఏడవ నిజాం మీర్ ఉస్మానలీఖాన్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనుకున్నారు. వీరి పేరుమీదనే ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆగష్టు 28, 1919వ సం॥లో ఏర్పాటైంది. దీనిని ప్రముఖంగా పర్యవేక్షించిన సర్ అక్బర్ హైదరీని ఉస్మానియా విశ్వవిద్యాలయ పితామహునిగా పేర్కొంటారు.